క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి


నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రమీల

దొర్నిపాడు: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట పరిహారం అందాలంటే రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. బుధవారం క్రిష్టిపాడు, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలను మద్దతు ధరకు విక్రయించుకోవాలంటే ఈ-పంట నమోదు ఉండాలన్నారు. పంటలకు ఎరువులు, పురుగు మందులను మోతాదుకు మంచి వాడకూడదని సూచించారు. నానో యూరియా, డీఏపీ ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి మిద్దె వాసులకు నోటీసులు


పోలీసులతో నోటీసులు ఇప్పిస్తున్న పంచాయతీ అధికారులు

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో మట్టి మిద్దెలో నివాసముంటున్న ప్రజలకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. బుధవారం ప్రధాన వీధిలో ఉన్న వ్యాపార దుకాణాల దారులకు సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ పీరయ్య ద్వారా పంచాయతీ కార్యదర్శి అశ్వనికుమార్ నోటీస్‌లు ఇప్పించారు. సీఐ మాట్లాడుతూ గత 5, 6 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దెలు దెబ్బతింటున్నాయన్నారు. పూర్తి శిథిలావస్థకు చేరుకున్న మిద్దెలలో నివాసం ఉండవద్దని వెంటనే ఖాళీ చేసి సురక్షిత గృహాల్లోకి వెళ్లాలన్నారు. ఇంత వరకు 150 మందికి నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రాణనష్టం జరగకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు హఠాన్మరణం

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామానికి చెందిన చౌకదుకాణం డీలర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి(66) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. భోజనానంతరం గుండె నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అందుబాటులో ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతి విషయం తెలుసుకున్న స్థానికులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బుధవారం ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో శివయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానం బోధన సమయాన్ని హరించే విధంగా ఉందన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్వరరెడ్డి, జాకీర్‌హుసేన్, తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సోమన్న

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 20లక్షల హెక్టార్లకు పైగా రైతులు పంటలు సాగు చేశారని, వాటికి అవసరమైన ఎరువులు అందక అవస్థలు పడుతున్నారన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా సహకార సంఘాల్లో పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ యూరియా అందడం లేదని అన్నారు. యూరియాను వ్యాపారులు కొరత సృష్టిస్తున్నారని, మరికొంత మంది డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. లేని పక్షంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

21న మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21న ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 93088 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చదువుకు'పాట్లు'


కోటకందుకూరులో అధ్వాన రోడ్డులో బడికెళ్తున్న బాలబాలికలు

- బురద దాటితేనే .. అఆఇఈలు
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అవస్థలు పడుతున్న విద్యార్థులు



బృందావనం నుంచి రాజానగరం హైస్కూల్‌కు ప్రమాదకరంగా బురదలో వెళ్తున్న విద్యార్థులు

చినుకు పడితే చాలు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. ప్రమాదకరంగా బురదలో బడికి వెళ్లాలి. ఏమాత్రం కాలు అదుపు తప్పినా కింద పడాల్సిందే. ఈ అవస్థ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మూడు పాఠశాలల విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉన్నాయి. ఈ మూడు పాఠశాలల్లో సుమారు 1100 మంది దాక విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారి నుంచి సుమారు అర కి.మీ మేర ఉన్న మట్టి రోడ్డు ఉంది. నాలుగు చినుకులు పడితే చాలు విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. బురద దాటి బడికి వెళ్లాలంటే కష్టమవుతుందని వాపోతున్నారు. ఈ సమస్యను పాలకులకు, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పాఠశాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేసి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- ఆళ్లగడ్డ మండలం బృందావనం నుంచి శిరివెళ్ల మండలం రాజానగరం హైస్కూల్ వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. విద్యార్థులు పొలాల గట్ల వెంట మూడు కిలోమీటర్ల మేర బురదలో నడవాలి. ఇలా విద్యార్థులే కాదు ఊళ్లోని ఎవరైనా బయటకు రావాలంటే ఈ మార్గమే దిక్కు. ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక రహదారులను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పారు. ఏడాది గడిచినా అతీగతీ లేదు. కనీసం పిల్లలు బడికెళ్లే మార్గాలనైనా బాగు చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

– ఆళ్లగడ్డ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: హౌసింగ్ పథకం ద్వారా జిల్లాకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. హౌసింగ్ సంబంధ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి సకాలంలో నిర్మాణాలు పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. నంద్యాల జిల్లాకు మొత్తం 59,239 ఇల్లు మంజూరు కాగా అందులో 31,682 ఇల్లు పూర్తయ్యాయని మిగిలినవి వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. ఐహెచ్‌హెచ్ఎల్ టాయిలెట్స్ జిల్లాకు మొత్తం 23,707 మంజూరయ్యాయని ఇందులో 11,661 టాయిలెట్స్ పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

21న మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21న ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి


గ్యారేజీ ఆవరణలో ధర్నా చేస్తున్న ఎస్ఎంయూ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఎస్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. రెండవ రోజు ఎస్ఎంయూ నాయకులు గ్యారేజీ ఆవరణలో గేటు ధర్నా నిర్వహించారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, చౌరెడ్డి మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పారదర్శక ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలని, రిటైర్డు ఉద్యోగులకు సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణాన్ని అనుమతించాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు సుబ్బరాజు, శేఖరప్ప, భాగ్యలక్ష్మి, నందీశ్వరుడు, సుబ్బారావు, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహ అధికారుల సంఘం అధ్యక్షుడిగా మునిరాజు


ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘం నాయకులను సన్మానించిన దృశ్యం

నంద్యాల(అర్బన్): బీసీ సంక్షేమ వసతి గృహ అధికారుల సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా మునిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సాయిబాబానగర్‌లోని బీసీ కళాశాల వసతి గృహంలో బుధవారం సంక్షేమ వసతి గృహ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బనగానపల్లె సమీపంలోని కొత్తపల్లె బీసీ వసతి గృహం వార్డెన్‌గా పని చేస్తున్న మునిరాజును జిల్లా అధ్యక్షుడిగా, జనరల్ సెక్రటరీగా షబ్బీర్ హుస్సేన్, ట్రెజరర్‌గా మేరి సూర్యకుమారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిని చేసిన సంఘానికి ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో వార్డెన్‌లు వెంకటపతి, సురేష్, వెంకన్నగౌడ్, శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహ ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పట్టణ డీఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ యుగంధర్, ప్రైవేటు పాఠశాల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్ బాషా ఉన్నారు


జాతీయ జెండాలతో మానవ హారంగా ఏర్పడిన విద్యార్థులు

గురురాజలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని శ్రీగురురాజ పాఠశాలలో బుధవారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషాలు ధరించి నృత్య ప్రదర్శనలు, ఉట్టికొట్టే సన్నివేశాలతో అబ్బురపరిచారు. సాంస్కృతి, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవ భావన పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు.

టిడ్కో ఇళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): టిడ్కో ఇళ్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుతో పాటు అర్జీ దారుడు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జత పరచాలన్నారు. వయస్సు 18 ఏళ్లు దాటి ఉండాలన్నారు. భూమి 10 ఎకరాల లోపు ఉండాలన్నారు. విద్యుత్ వినియోగం 300 యూనిట్స్‌లోపే ఉండాలని, కుటుంబంలో నాలుగు చక్రాల వాహనం ఉండరాదన్నారు. కుటుంబంలో ప్రభుత్వ ఔట్‌సోర్స్, కాంట్రాక్ట్, పెన్షన్ ఉద్యోగి ఉండకూడదన్నారు. పై అర్హతలు ఉన్న వారు టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నంద్యాల: పట్టణంలోని బొగ్గులైన్‌కు చెందిన వృద్ధురాలు వెంకటమ్మ(85) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో కాచిగూడ రైలు వృద్ధురాలిని ఢీకొంది. గమనించిన బంధువులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. వృద్ధురాలి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్‌ను నియమించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప విమర్శించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ, కేవీఆర్, ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా క్లస్టర్ యూనివర్సిటీ యాక్ట్-2020 ప్రకారం వీసీ, రిజిస్ట్రార్ పోస్టులు తప్ప ఏ ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. జగన్నాథగట్టుపై నిర్మిస్తున్న భవనాలు అసంపూర్తిగానే మిగిలాయని, వాటిని పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే భవనాలను పూర్తి చేయాలని కోరారు. క్లస్టర్ వర్సిటీని మూసి వేస్తున్నారని వస్తున్న వార్తలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అమర్, యోగి, మనోహర్, చిన్న పాల్గొన్నారు.

మొక్కజొన్న చేతికొచ్చేనా?


దొర్నిపాడులో వర్షానికి తడిసి పోయిన కంకులు

దొర్నిపాడు: భారీ వర్షాలు ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రస్తుతం ఈ పంట కంకిదశలో ఉంది. ఎడతెరిపి లేకుండా గత కొద్ది రోజులుగా వానలు పడుతుండటంతో కంకులు చివరికి చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి మండలంలో ఎన్నడూ లేని విధంగా 500 హెక్టార్లకు పైగా మొక్కజొన్న పంట సాగు చేశారు. సాగు చేసి చేసినప్పటి నుంచి వరుణుడు కంగారు పెట్టిస్తున్నాడు. ప్రస్తుతం కంకులన్నీ వానకు తడుస్తుండటంతో గింజలు రంగుమారే అవకాశం ఉంది. కాపాడుకునేందుకు యూరియా చల్లాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే, మార్కెట్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


క్రిష్టిపాడులో సాగు చేసిన మొక్కజొన్న

రోడ్డు ప్రమాదంలో పెళ్లి బృందానికి గాయాలు

కల్లూరు: 44 జాతీయ రహదారి పెద్దటేకూరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందానికి గాయ్యాలయ్యాయి. చిన్నటేకూరు గ్రామానికి చెందిన పెళ్లి బృందం (వధువు తరపువారు) పెద్దటేకూరులో వరుడి ఇంటి వద్ద జరిగే వివాహ కార్యక్రమానికి ట్రాక్టర్‌లో బయలు దేరారు. పెద్దటేకూరు దగ్గర సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి ఉండగా.. మరిచిపోయి బ్రిడ్జిపై ముందుకెళ్లి రివర్స్ వచ్చి సర్వీస్ రోడ్డులో పోవడానికి ప్రయత్నిస్తుండగా పెళ్లి బృందం ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 12 మంది స్వల్ప గాయాలకు గురికాగా, ముగ్గురికి తీవ్రగాయ్యాలయ్యాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనం సిబ్బంది గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో చిన్నటేకూరు క్యాంపస్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆశోకా మహిళ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఆశోక్‌వర్ధన్ రెడ్డి, చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గాయపడిన వారిని తన కార్లలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న చాగలమర్రి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

నంద్యాల(అర్బన్): గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పంచాయతీల ప్రగతి, పురోగతి సూచికలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమాచారం మొత్తం పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామస్థాయి అభివృద్ధి లక్ష్యం సాధించినప్పుడే మండలం, జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్, జెడ్పీటీసీ జగదీశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీల ప్రగతి పురోగతి సూచికలపై శిక్షణ సమావేశాన్ని ఈఓఆర్డీ నాగఅనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఆయా శాఖల అధికారులు, పీఎస్‌లు పాల్గొన్నారు.

చాగలమర్రి: పంచాయతీ పురోగతి సూచిక(2.0)పై బుధవారం మండలకేంద్రం చాగలమర్రిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుసేన్ తదితరులుపాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పంచాయతీల అభివృద్ధిపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలు అభివృద్ధి బాటలో నడిచేందుకు సహకరించాలని కోరారు.

అభివృద్ధికి సూచికలు తయారు చేయండి

శిరివెళ్ల: గ్రామాల సమగ్రాభివృద్ధికి సూచికలు తయారు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మండల ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతు ప్రభుత్వ శాఖల అధికారులు 2024-25 సంవత్సరంలో జరిగిన వివిధ కార్యక్రమాలు, పురోగతిని యాప్‌లో పొందు పరచాలన్నారు. శాఖల వారీగా జరిగిన అభివృద్ధిని అప్‌లోడ్ చేయాలన్నారు. ఐసీడీఎస్, విద్యా, వైద్య, రెవెన్యూ, నీటి పారుదల, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధానంగా సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సర్పంచులు, ఎంపీటీసీలు తమ తమ గ్రామాల స్వయం సమృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవికుమార్, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఉపాధి ఏపీఏ వెంకట సుబ్బయ్య, వెలుగు ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుందూ వరద ఉధృతి

- జలదిగ్బంధంలోనే నాలుగు గ్రామాలు


ఉయ్యాలవాడ- రూపనగుడి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది


హరివరం గ్రామం సమీపంలో కుందూ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు

ఉయ్యాలవాడ :మండలంలో రెండో రోజు బుధవారం కూడా కుందూనదిలో వరదనీటి ఉధృతి కొనసాగుతోంది. ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, హరివరం గ్రామాల సమీపంలో నదిపై వున్న వంతెనల వద్ద ప్రమాదస్థాయిలో వరద నీరు ప్రవహిస్తూ వుంది. బోడెమ్మనూరు, కాకరవాడ, ఒంటెద్దుపల్లె, ఆర్.జంబులదిన్నె గ్రామాలకు వరద నీరు చుట్టు ముట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరమయ్యారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లాలన్నా, పశువులకు పశు గ్రాసం తెచ్చుకునేందుకు పంట పొలాలకు వెళ్లల న్నా వీలు లేని పరిస్థితి. గ్రామం చుట్టూ నీరు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండడంతో దిక్కులు చూస్తున్నారు. అత్యవసర సరుకులు సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. రెండు రోజులుగా పంటల్లో నీరు ప్రవ హిస్తూ వుండడంతో పంటలు పూర్తి స్థాయిలో దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ట్రాక్టర్‌తో పల్లమాను


నాట్లు వేస్తున్న కూలీలు

వరి నాట్లు ఆరంభం


పొలంలోకి వరి నారు తీసుకెళ్తున్న కూలీలు

శిరివెళ్ల: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు మొదలయ్యాయి. కేసీ కెనాల్, తెలుగు గంగలకు సాగు నీరు విడుదల కావడంతో రైతన్న నాట్లు మొదలు పెట్టారు. ఖరీఫ్ ఆరంభం మే నెల చివరిలో రైతులు ఆరు తడి పంటల కింద మినుము సాగు చేశారు. కోత అనంతరం నాట్లు మొదలయ్యాయి. మండలంలో ప్రతి ఏటా 6,500 హెక్టార్లలో వరి పంట సాగవుతుంది. కోటపాడు, వీరారెడ్డిపల్లె, వనికినిదిన్నె, వెంకటాపురం బోయల కుంట్ల, చెన్నూరు, గంగవరంలలో వంద శాతం వరి సాగవుతుంది. మిగిలిన గ్రామాల్లో జొన్న, మొక్క జొన్న పంటలు సాగవుతాయి. పనులు మొదలు కావడంతో రైతులు, కూలీలు పొలం పనుల్లో బిజీ అయ్యారు. ఇతర మండలాల నుంచి వ్యవసాయకూలీలు వచ్చి ఇక్కడ వరి నాట్లు వేస్తున్నారు.